


శరీరానికి గుండె ఎల్లాంటిదో పడగ్గది అల్లాంటిది. పడగ్గదిలేని ఇంటికి ఇతరత్రా ఎన్ని హంగులున్నా అది ఇల్లనిపించుకోదు. ఇల్లు విశాలంగానూ ఎంతో మనోహరం గానూ వుండొచ్చు. ఆ యింటికి పడగ్గది లేకపోతే ఆ శోభ రాణించదు. ఆ మాటకొస్తే ఇల్లు ఎట్లా అఘోరించినా పడగ్గది మాత్రం గొప్ప కళాత్మకంగా వుండాలంటాను. పడగ్గది పరవశం కలిగించకపోతే మనిషి బతుకు పరమ నీరసంగానూ, ఎంతో నిరుత్సాహంగానూ వుంటుందని ఎక్కడో చదివేను. వదిలేయండి.

పొట్ట చేత్తో పట్టుకుని ఎక్కడెక్కడ్నుంచో రాష్ట్ర రాజధానికొచ్చేం. సొంత యిల్లు కట్టించుకునే తాహతు ఎట్లాగూ లేదు. అంచేత అద్దె కొంపే

దిష్టి. జీతంలో మూడో వంతు తగలేయందే ఇల్లు దొరకదు. ఇల్లంటే బంగళా అనికాదు నా ఉద్దేశం. రెండు, మూడు గదులున్న పోర్షనని అర్థం. ఈ గదుల్నే మనం విజిటర్స్ హాలుగా వినియోగిస్తాం. డ్రాయింగ్ రూమంటాం. డైనింగ్ హాలంటాం. పడగ్గదిగా ఒక గదిని భావించుకుంటాం. పగలు డైనింగ్ హాలుగా వాడుకునే గదే రాత్రికి బెడ్ రూమవుతుంది. మరింక వేరే మార్గమే లేదు. ఇంక అలాంటప్పుడు పడగ్గదీ పరవశమనే అర్థం లేదని తెలుసుకోవాలి.

పిల్లా మేకతో మనమే అరడజను మందిమి ఆ మూడు గదుల్లో మగ్గిపోతుంటాం. మనమీద ఆధారపడిన తల్లిదండ్రుల్ని కూడా తెచ్చుకుంటే ఆ కొంపలో చోటు చాలక కిటికీలెక్కి కూచోవలసిందే. బంధువులుకూడా వస్తూ పోతున్నారంటే ఆ కష్టాలు చెప్పనలవి కాదు. అన్ని గదులూ పడగ్గదులే! ఆ గదులు చాలక రోడ్డు పక్కన చాప పరుచుకుంటాం. దేవుడా లారీలను రానివ్వకు తండ్రీ అని దేవుణ్ని ప్రార్థించి పడుకోవాలి. అంచేత సామాన్యుడికి పడగ్గది అందుబాటులో వుండదని థియరీ ఒకటి తయారయ్యింది. తెగించి వున్న మూడు గదుల్లో ఒక గదికి బెడ్ రూమని బోర్డు కట్టినా పక్క గదిలో పడుకున్న పిల్లలు ఆ గదిలోకి రాకమానరు. అమ్మా భయం, నాన్నా దెయ్యమంటారు. అమ్మకీ, నాన్నకి మధ్యన చేరిపోతారు. ప్రతి చిన్న శబ్దానికి కళ్ళు విప్పేసి లేచి కూచుంటారు. ఇంక ఆ గది సత్రంలో వున్న కామను హాలవుతుందే గాని పడగ్గది అని చస్తే పిలిపించుకోదు.

రెండు మూడు గదుల వాటాలనే ఇళ్ళను కుంటున్నాం. గనక ఒక్కో ఇంట్లో మూడు నాలుగు వాటాలుంటాయి. మన పడగ్గదికి పక్కవాటా వారి బెడ్ రూమ్‌కి మధ్యన తలుపొక్కటే అడ్డం. ఆ తలుపు తీస్తే వాళ్ళ పడగ్గది మనకీ, మన పడగ్గది వాళ్ళకి సుబ్బరంగా కనిపిస్తుంది. అంచేత అటు వేపు వాళ్ళు గొళ్ళెం పెట్టి తాళం వేస్తే ఇటు వేపు మనం గెడపెట్టి మేకులు కొడతాం. ఇదంతా ప్రత్యేకమైన శ్రద్ధతో చేసుకుంటాం. గనక తలుపు

తోసినా తెరుచుకోదు. కాకపోతే సౌండు ప్రూఫు కాదు కనక మనమెంత మెల్లిగా మాటాడుకున్నా మన మాటలు వాళ్ళకి, వాళ్ళ పలుకులు మనకీ మైకులో చెప్పినట్లు వినిపిస్తుంటాయి. వాళ్ళు త్వరగా నిద్రపోవాలని మనం, మనకి నిద్రపట్టాలని వాళ్ళూ పందేలు కాసుకుని తెల్లవార్లూ ఎవ్వరూ నిద్రపోకుండా గడిపేస్తాం. మనిషి మొహం చూసి అతనింటిలో పడగ్గది పకడ్బందీగా వుందో లేదో సులువుగా చెప్పవచ్చు. పడగ్గది ఇబ్బందిలో పడ్డ మానవుడ్ని పలకరిస్తే కరుస్తాడు. శాంత గంభీరస్వరం పోయి చిరాకు పడతాడు. నిమిషానికి నూటిరవై సార్లు నిట్టూర్పులతో సతమతమవుతాడు. హల్లో గురూ అని విష్‌చేస్తే చాల్లే ఉరుకోమని కసురుకుంటారు. పడగ్గదిలో పరవశుడైన గురుడు ఎంతో ప్రసన్నంగా వుంటాడు. పగలుకూడా పెట్రోమాక్సు లైటులాగా వెలిగిపోతాడు. అనిర్వచనీయమైన కాంతి అతని మొహంలో తాండవిస్తుంది. అడగ్గానే అప్పు యిచ్చి ఆదుకుంటారు.

పడగ్గది ఎట్లా వుండాలనేది ప్రశ్న. ఎట్లా వున్నా అది మనసుని రంజింప చేయాలనేది ఆన్సరు. డబుల్‌కాట్ బెడ్డూ, ఫోం పరుపూ, నీటుగా వుండే బెడ్ షీట్లు మాత్రమే చాలవు. ఉన్న నాలుగ్గోడలూ పెచ్చులూడకుండా వుండాలి. సున్నమో పెయింటో శ్రద్ధగా వేసి వుంచాలి. గోడల మీద భక్తి బొమ్మల కన్నా, రక్తి బొమ్మలే ఎక్కువగా వుండాలి. ఆ బాపతు బొమ్మలు గీయించి తెచ్చుకోడం ఖర్చెక్కువనుకుంటె అల్లాంటి బొమ్మలున్న కేలెండర్లతో సరిపెట్టుకోవాలి. బొత్తిగా బీడీ కేలండర్లు కాకుండా విస్కీ కేలండర్లయితే బెటరు. విస్కీ కేలండర్లలో రక్తి ఎక్కువగా వుంటుందని పరిశీలనలో తేలింది. చూసిన వాడికి ఇంటి యజమాని గొప్ప తాగుబోతుగా భ్రమ కలగవచ్చు. వాళ్ళేదో అనుకుంటారని భయపడితే బొమ్మలకి దూరమైపోతాం.

స్ప్రేలూ, సెంట్లూ ఎట్లాగూ కొనలేం. కనీసం అగరుబత్తీలైనా అఘోరించకపోతే పడగ్గది ఘుమఘుమ లాడదు. ఫేను సరేసరి తప్పదు. కొత్తగా కొనే అవసరం లేకుండా అత్తవారిచ్చిన రేడియో వుండనే వుంటుంది. వివిధ భారతి వారికిరాసి రెండర్థాల పాటలు వినిపించుకుంటే రక్తి పాటలకు లోటుండదు. అందుబాటులో వున్న ఈ చిన్న చిన్న ఏర్పాట్లు

చేసుకుంటే పరవశమనే పదార్థం మన అడ్రసు వెతుక్కుని వస్తుంది. పడగ్గదిని పదిమందిలోకి తెచ్చి పరమ మోటుగా సరిగమలు వినిపిస్తున్నానని సహృదయులు విసుక్కోవచ్చు. నిత్య జీవితంమ్మీద పడగ్గది ప్రభావం చాలా వుంటుందని చెప్పడం మినహాయించి సంజాయిషీ యిచ్చుకోలేను.

పేరుగానీ వివరాలుగనీ రాయను గొప్పింటి కుర్రాడు, పెళ్ళి కాలేదు. సినిమా తీయాలని కోరిక. కథకొన్నాడు. నేనంటే అభిమానం. కథ వింటారా అన్నాడు. వింటానన్నాను. ఇంటికి రండన్నాడు. అతని కారెక్కి వాళ్ళింటి దగ్గర దిగేను. అత్యాధునికమైన భవంతి. ఇంద్రుడు భూలోకానికి వస్తే అందులోనే అద్దెకుంటాడు. అంత డాబుసరిగా వుంది. అదే మాట అతన్తో అన్నాను. ఇల్లు ఎట్లుండవలెననే వాళ్ళ నాన్నగారి అభిప్రాయాన్నీ అమెరికన్ ఏక్సెంట్ వాడి ఇంగ్లీషులో వినిపించేడు. ఇల్లు మొత్తం చూపించేడు. అతని పడగ్గది చూసి అదిరిపోయేను. మంచాలూ పరుపులూ ఫ్లోరింగూ సోఫాలూ వదిలేయండి. ఆ గది గోడలనిండా శృంగార లీలల్తో బొమ్మలు. చూస్తుంటే మతిపోతుంది. ఆ గదిలోకి సెన్సారు వాళ్ళొస్తే కత్తెర్ల కోసం కేకలు పెడతారు. టేప్ రికార్డరు ఆనుచేసేడు. అదొక పాట. భాష తెలీదు. ఇంగ్లీషులాగానే వుంది ఫ్రెంచి కూడా కావొచ్చు. పాటకంటే నిట్టూర్పులూ, తియ్యగా మూలగడాలూ ఎక్కువగా వినిపించాయి. పిచ్చి కేకలు సరేసరి. పెద్దింట్లో బ్రహ్మచారి పడగ్గదే ఈ తీరున వుంటే దంపతుల గది ఏ లెవల్లో వుంటుందో ఊహకి అందలేదు. అడిగి తెలుసుకుందామంటే నోర్రాలేదు.